మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 29-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 361 Issue: 361

29 జూన్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:48 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి పౌర్ణమి తె. 5:26౦ వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం మూల తె. 3:55౦ వరకు తరువాత పూర్వాషాఢ యోగం శుక్ల మ. 2:16 వరకు కరణం విష్టి సా. 4:16 వరకు బవ తె. 5:26౦ వరకు వర్జ్యం ఉ. 10:06 నుండి ఉ. 11:54 వరకు దుర్ముహూర్తం మ. 12:45 నుండి మ. 1:37 వరకు మ. 3:21 నుండి సా. 4:13 వరకు రాహుకాలం ఉ. 7:26 నుండి ఉ. 9:04 వరకు యమగండం ఉ. 10:41 నుండి మ. 12:19 వరకు గుళికాకాలం మ. 1:57 నుండి మ. 3:35 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:12 నుండి తె. 5:00 వరకు అమృత ఘడియలు రా. 8:57 నుండి రా. 10:45 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:45

Circulated to Telangana
Published from Jagitial



## నై..రుతి!

**తెలంగాణలో 32 శాతం లోటు వర్షపాతం**

### దోబూచులాడుతున్న రుతుపవనాలు

### దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు

### దేశవ్యాప్తంగా 45 శాతం లోటు వర్షపాతం

### ఖరీఫ్‌పై తీవ్ర ప్రభావం.. ఆందోళనలో రైతులుల

నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినప్పటికీ, పూర్తి స్థాయిలో వర్షపాతం నమోదు కావడంలేదు. కొన్నిరోజులు చురుగ్గా ఉంటే, మరికొన్ని రోజులు నిలిచిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

న్యూఢిల్లీ: జూన్ 28 నాటికి దేశంలో 45 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఇది ఖరీఫ్ సాగుపై తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. జలాశయాల్లో నీటి మట్టాలు పడిపోవడం, వేడి కారణంగా విద్యుత్ వినియోగం పెరగడం వంటి సమస్యలు తరువాయి 2 వ పేజీలో...



## మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

**'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హెరైజన్'తో సత్కారం**

### పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి గుర్తింపుగా గౌరవం

**సెషెల్స్‌కు 'మేడ్ ఇన్ ఇండియా' గస్తీ నౌక, వాహనాలు అందజేత**

అంతర్జాతీయ గౌరవం లభించింది. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా సీషెల్స్ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారమైన -2 వ పేజీలో...

## ఆ నాడే తెలంగాణ రావాల్సింది!

### ముందే విభజన జరిగి ఉంటే బాగుండేది

### రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందేవి

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఏపీ, తెలంగాణ విభజనపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను విద్యార్థిగా ఉన్న సమయంలోనే అనేక ఉద్యమాలు జరిగాయన్నారు. ముఖ్యమంత్రి చెన్నారెడ్డిని దింపాలని, ఆ తరవాత నరసింహారావును దింపేయాలని మరో ఉద్యమం జరిగిందన్నారు.



విజయవాడ, జూన్ 28 (ఈవార్తలు): ఏది ఏమైనా ఆనాడే రెండు రాష్ట్రల విభజన జరిగి ఉంటే ఇంకా అభివృద్ధి చెందేవని చెప్పారు. ఏపీ మరింత అభివృద్ధి చెందేదని అన్నారు. బీజేపీ కూడా ఒక ఓటు రెండు రాష్ట్రాలు అని పిలుపునిచ్చిందని చెప్పారు. వెంకయ్యనాయుడు ఏదో ఒకరకంగా అడ్డుకట్ట వేస్తారని అప్పుడు తరువాయి 2 వ పేజీలో...



## నాడు కొండా లక్ష్మణ్.. నేడు కోమటిరెడ్డి!

### తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేశారు

**పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు.. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు: సీఎం రేవంత్ రెడ్డి**

బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కేంద్రంలో బీజేపీ 12 ఏళ్ల పాలన, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనపై ప్రత్యేకంగా అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు నిర్వహించి బహిరంగ చర్చకు సిద్ధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతిపక్షాలు స్పీకర్, శాసన మండలి ఛైర్మన్‌కు లేఖ రాస్తే ఎవరు ఏం చేశారో సభలో తేల్చుకుందామని సవాల్ విసిరారు.

నల్లగొండ, జూన్ 28 (ఈవార్తలు): ఆదివారం నల్లగొండలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ రూ.13 వేల కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 6,300 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రి పదవిని త్యాగం చేశారని, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,395 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,896 |

## 15 వేల మంది హత్యకు కుట్ర!

**ముంబైలో భారీ విషప్రయోగ యత్నం.. మొహర్రం ఊరేగింపు లక్ష్యంగా కుట్ర**



ముంబైలో జరగాల్సిన మొహర్రం ఊరేగింపును లక్ష్యంగా చేసుకుని, పెద్ద ఎత్తున సామూహిక విషప్రయోగానికి పన్నిన భారీ కుట్రను ముంబై పోలీసులు భగ్నం చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూణెకు చెందిన ఓ వ్యాపారవేత్తను అరెస్టు చేసి, అతడి నుంచి దాదాపు 15,000 విషపూరిత క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సత్వర స్పందనతో నగరంలో ఓ పెను విషాదం తప్పినట్లయింది.

ముంబై: పోలీసుల కథనం ప్రకారం, పూణెలోని విమాన్ నగర్‌కు చెందిన పెయింట్ వ్యాపారి ఫయాజ్ ప్రేమ్‌జీ (39) ఈ కుట్రకు పాల్పడ్డాడు. దక్షిణ ముంబైలోని డోంగ్రీ ప్రాంతంలో ఓ అతిథి గృహంలో బస చేసిన ఆయన, మొహర్రం ఊరేగింపులో పాల్గొనే భక్తులకు నొప్పి నివారణ మందులు లేదా ఇమ్యూనిటీ బూస్టర్లని నమ్మించి ఎలుకల మందు నింపిన క్యాప్సూల్స్‌ను పంపిణీ చేయాలని పథకం వేశాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తికి మాత్ర ఇవ్వగా, అతడికి వాంతులు, కడుపునొప్పి రావడంతో పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి అత్యంత విషపూరితమైన జింక్ ఫాస్ఫైడ్‌తో నింపిన 14,900 క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గడిచిన ఏడాది కాలంలో నిందితుడు తరువాయి 2 వ పేజీలో...



## బెంగాల్‌లా తెలంగాణలో!

### బెంగాల్ ఫలితాలు పునరావృతం

### పటేల్ వల్లే హైదరాబాద్ విముక్తి

### హామీల అమలులో కాంగ్రెస్ ఫెయిల్

### బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

హైదరాబాద్, జూన్ 28 (ఈవార్తలు): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరేయడమే లక్ష్యంగా ప్రజాపోరాటాలు చేయాలని నాయకులు, కార్యకర్తలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణలోనూ రిపీట్ కావాలని ఆకాంక్షించారు. పశ్చిమ బెంగాల్‌లో కార్యకర్తల అలుపెరగని కృషితోనే బీజేపీ అక్కడ తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



గుర్రపు పందేల చరిత్రలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఓ గుర్రం, ఫినిషింగ్ లైన్ వద్ద తన నాలుకను బయటకు చాచి, ప్రత్యర్థి గుర్రంపై విజయం సాధించింది. పోటీ ఎంతో ఉత్కంఠభరితంగా సాగడంతో విజేతను నిర్ణయించేందుకు అధికారులు హై-స్పీడ్ ఫోటో ఫినిష్ కెమెరా చిత్రాలను పరిశీలించారు. ఆ దృశ్యాలను పరిశీలించగా ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ప్రత్యర్థి గుర్రం కంటే.. 'ఓహ్.. దిస్ ఈజ్ అజ్' అనే గుర్రం నాలుక చివర ఫినిషింగ్ లైన్‌ను క్షణం ముందే దాటినట్లు తేలింది. సాధారణంగా గుర్రపు పందేల్లో "ముక్కు తేడాతో" విజయం సాధించినట్లు చెబుతుంటారు. కానీ ఈ గుర్రం మాత్రం "నాలుక తేడాతో" గెలిచి గుర్రపు పందేల చరిత్రలో ప్రత్యేకమైన రికార్డును సృష్టించింది.

## అమెరికా అటాక్

### ఇరాన్ స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు

### ముప్పులో అంతర్జాతీయ ముడిచమురు సరఫరా మార్గం

వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి ప్రాంతంలో అమెరికా సైన్యం ఇరాన్ లక్ష్యాలపై భారీ దాడులు జరిపింది. ఇరాన్‌కు చెందిన నిఘా వ్యవస్థలు, కమ్యూనికేషన్ కేంద్రాలు, గగనతల రక్షణ స్థావరాలు, డ్రోన్ గిడ్డంగుల, సముద్రపు మైన్లను అమర్చే సామర్థ్యాలపై అమెరికా బలగాలు విరుచుకుపడ్డాయి.



టెహ్రాన్: పనామా పతాకంతో ప్రయాణిస్తున్న 'కికు' అనే ముడిచమురు నౌకపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడిన నేపథ్యంలో అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఈ ప్రతీకార చర్యలు చేపట్టింది. అమెరికా సైనిక వర్గాల సమాచారం ప్రకారం, 20 లక్షల బ్యారెళ్లకు పైగా ముడిచమురుతో ప్రయాణిస్తున్న 'కికు' నౌక హర్మూజ్ జలసంధి సమీపంలో శనివారం తెల్లవారుజామున ఇరాన్ డ్రోన్ దాడికి తరువాయి 2 వ పేజీలో...



## ఇరాన్ ఫైర్

### కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు

**తమపై అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా ఈ చర్య చేపట్టినట్లు ప్రకటన**

కువైట్, బహ్రెయిన్‌లలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. కువైట్‌లోని అలీ అల్ సేలం ఎయిర్‌బేస్, బహ్రెయిన్‌లోని పోర్ట్ సల్మాన్‌లో ఉన్న అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌పై ఈ దాడులు జరిగినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ధ్రువీకరించింది.

టెహ్రాన్: ఒక రోజు క్రితం అమెరికా తమ భూభాగంలోని ఐదు ప్రాంతాలపై దాడులు జరిపిందని, దానికి ప్రతీకారంగానే ఈ చర్యలు తీసుకున్నామని ఇరాన్ స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడటంతో అమెరికా ప్రతీకార చర్యలు ప్రారంభించింది. ఈ దాడులు, ప్రతిదాడుల పరంపరతో ఇరు దేశాల మధ్య జూన్ 17న కుదిరిన 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా నీరుగారిపోయింది. పశ్చిమాసియాలో -2 వ పేజీలో...



## టీటీడీకి అనంత్ అంబానీ రూ.27.5 కోట్ల విరాళం

**25 ఎలక్ట్రిక్ బస్సులు విరాళంగా ప్రకటన**

**బస్సుల నిర్వహణ, డ్రైవర్ల జీతాలు తామే భరిస్తామని వెల్లడి**

తిరుమల, జూన్ 28 (ఈవార్తలు): ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ -2 వ పేజీలో...

## రాశి ఫలాలు
29.6.2026

మేషం: అప్పుల నుండి అవసరానికి ధన సహకారం అందుతుంది. పాత ఋణాల నుండి విముక్తి లభిస్తుంది. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. వ్యాపారపరంగా నూతన పెట్టుబడులు లభిస్తాయి. సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

వృషభం: చుట్టుపక్కల వారితో ఆస్థి వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయంతో పదోన్నతులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులలో ఆత్మ విశ్వాసంతో పని చేసి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి.

మిధునం: ఋణ ఒత్తిడి అధికమై మానసిక శిరో భాధలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. దైవ సేవా కార్యక్రమాలలో అప్తులతో పాల్గొంటారు. సంతాన విద్యా విషయంలో ఊహించని విషయాలు తెలుస్తాయి. స్థిరాస్తి ఒప్పందాలు అతికష్టం మీద పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

కర్కాటకం: మిత్రులకు మీ అభిప్రాయాలు నచ్చవు. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేయలేరు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలుంటాయి. ఇంటా బయట ఒత్తిడి వలన మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాల్లో సహోద్యోగులతో సమస్యలు కలుగుతాయి. వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి.

సింహం: ఆర్ధిక ప్రయత్నాలు అనుకూల ఫలితాలు ఇస్తాయి. బంధుమిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అందరితో సఖ్యతగా వ్యవహారిస్తారు. సమాజంలో కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. వాహన యోగం ఉన్నది. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. బంధు మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

తుల: ముఖ్యమైన విషయాలలో స్వంత నిర్ణయాలు కలిసిరావు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి ఉద్యోగమున విలువైన పత్రములు విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృశ్చికం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది. చేపట్టిన పనులు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: కీలక వ్యవహారాలలో ధైర్యంగా నిర్ణయాలను తీసుకుని లాభాలు అందుకుంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు అందుతాయి. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఇతరుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మకరం: చెయ్యని పనికి ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. ఉద్యోగమున పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రాహారాలు ఉండవు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. అప్తులతో మాట పట్టింపులు కలుగుతాయి.

కుంభం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

మీనం: ప్రయాణాలలో మార్గ అవరోధాలు తప్పవు. ధన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కావు. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. ఊహించని రీతిలో ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట ప్రతి విషయంలో అప్రమత్తంగా వ్యవహారించాలి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.



# ఆ నాడే తెలంగాణ రావాల్సింది!

మొదటి పేజీ తరువాయి

అనుకున్నారని, కానీ సోనియాగాంధీ తనను అడిగినప్పుడు విభజనకు ఓకే చెప్పానని తెలిపారు. సోనియా గాంధీ వచ్చి మీరు సీరియస్ గానే చెబుతున్నారా? అని అడగ్గా అవుననే సమాధానం ఇచ్చానని అన్నారు. ఆ తరవాత దిగ్విజయ్ సింగ్, మురళీదేవర తనవద్దకు వచ్చి బీజేపీ తెలంగాణకు అనుకూలమేనా? మీరు ఏదో ఒక రకంగా అడ్డుకట్ట వేస్తారని అంతా అనుకుంటున్నారని చెప్పారన్నారు. తాను పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసే వ్యక్తినని రెండు రాష్ట్రాలు ఏర్పడాలనేదానికి తాను వ్యతిరేకం కాదని చెప్పినట్టు తెలిపారు. కానీ ఆంధ్ర ప్రదేశ్‌కు తగిన న్యాయం జరగాలని దాని కోసం పోరాడతానని చెప్పినట్టు వెల్లడించారు. ఆరోజు రాత్రి 2గంటల వరకు వాదోపవాదనలు జరిగాయన్నారు. తాను ఏపీకి తగిన న్యాయంకోసం ప్రభుత్వంతో గట్టిగా వాదించానని అన్నారు. దిగ్విజయ్ సింగ్, మురళీదేవర తనతో సుమారు మూడునాలుగు రోజులు సంప్రదింపులు జరిపారిన చెప్పారు. ఒకవేళ మీరు విభజనను వ్యతిరేకిస్తే మీ మీద సాకుతో మేం కూడా విభజనను వ్యతిరేకించాలని అనుకుంటున్నాం అని తనతో చెప్పారన్నారు. కానీ తాను తెలంగాణ ఏర్పాటుకు సమర్ధిస్తాననే చెప్పానని తెలిపారు. ఆ తరవాత ఏపీకి ఏ రాష్ట్రానికి లభించని నిధులు, ప్రాజెక్టులు వచ్చాయని అన్నారు. ఏదో ఒక సంస్థ వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చానని తెలిపారు.

## నై..రుతి!

మొదటి పేజీ తరువాయి

తలెత్తుతున్నాయి. జూన్ 4 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా సాధారణంగా 141.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 77.1 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. వారం క్రితం 40 శాతంగా ఉన్న లోటు ఇప్పుడు 45 శాతానికి చేరడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఉపగ్రహ చిత్రాల ప్రకారం, మధ్య, పశ్చిమ, వాయవ్య భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో ఆకాశం మేఘరహితంగా ఉంది. కేవలం ఈశాన్య రాష్ట్రాలు, ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా గుజరాత్‌లో 86 శాతం, మహారాష్ట్రలో 60 శాతం వర్షపాత లోటుతో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. మధ్యప్రదేశ్ (42 శాతం), ఉత్తరప్రదేశ్ (59 శాతం), బీహార్ (52 శాతం), ఒడిశా (53 శాతం), కర్ణాటక (47 శాతం) రాష్ట్రాల్లోనూ తీవ్ర వర్షాభావం నెలకొంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, తెలంగాణలో 32 శాతం లోటు నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మెరుగ్గా ఉండి సాధారణ వర్షపాతం నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి. వాతావరణ నిపుణుల ప్రకారం, ఇది 'బ్రేక్-లైక్ ఫేజ్' అని, తేమతో కూడిన గాలులు బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాలకే పరిమితమై దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించడం లేదని చెబుతున్నారు.

## అమెరికా అటాక్

మొదటి పేజీ తరువాయి

గుర్తైంది. ఈ ప్రమాదంలో సిబ్బందికి ఎటువంటి గాయాలు కాలేదని, పర్యావరణానికి కూడా ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రాథమిక నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నౌక ఖతార్ చమురు క్షేత్రం నుండి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) రేవుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. గత రెండు రోజుల్లో అమెరికా దాడులు చేయడం ఇది రెండోసారి. అంతకుముందు శుక్రవారం 'ఎవర్ లఫ్లీ' అనే మరో వాణిజ్య నౌకపై జరిగిన దాడికి ప్రతిస్పందనగా కూడా ఇరాన్ భూభాగంపై అమెరికా దాడులు చేసింది. దీనికి ప్రతికారంగా తాము కూడా ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ విప్లవాత్మక బలగాలు (ఐఆర్‌జీసీ) ప్రకటించాయి. తాజా ఉద్రిక్తతలతో ఉభయ దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం ప్రమాదంలో పడింది. ప్రపంచ ముడిచమురు రవాణాకు జీవనాడి లాంటి హార్మ్యూజ్ జలసంధిలో రాకపోకల రుసుములు, సురక్షిత మార్గాలపై వివాదాలు మరింత ముదిరాయి. ప్రత్యామ్నాయంగా ఒమన్ తీరం వెంబడి మార్గాలను విస్తరిస్తున్నప్పటికీ, వాణిజ్య నౌకలు ప్రస్తుతం అమెరికా సైనిక నిఘా నీడలోనే ప్రయాణిస్తున్నాయి.

## టీటీడీకి అనంత్ అంబానీ రూ.27.5 కోట్ల విరాళం

మొదటి పేజీ తరువాయి

అంబానీ నేడు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీకి భారీ విరాళం ప్రకటించారు. తిరుమల ఘాట్ రోడ్లలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా రూ.27.5 కోట్ల వ్యయంతో 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయానికి చేరుకున్న అనంత్ అంబానీ, శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులతో సమావేశమైన అనంత్ అంబానీ, తిరుమలలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీలోనే ఆయన భారీ విరాళంపై ప్రకటన చేశారు. కేవలం ఎలక్ట్రిక్ బస్సులను అందించడమే కాకుండా వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఈ బస్సులను నడిపే డ్రైవర్ల జీతభత్యాలను సైతం పూర్తిగా రిలయన్స్ సంస్థే భరిస్తుందని స్పష్టం చేశారు. అనంత్ అంబానీ తీసుకున్న ఈ నిర్ణయంపై టీటీడీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 26 గంటల సమయం పడుతోంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు సోమవారం నాటి వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు శ్రీవాణి దర్శనాలను కూడా రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది.

## నాడు కొండా లక్ష్మణ్.. నేడు కోమటిరెడ్డి!

మొదటి పేజీ తరువాయి

కిష్టయ్య, యాదయ్య తదితరుల త్యాగాలను ఎవరూ మరవలేరని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు త్యాగాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించిన సీఎం, తెలంగాణను భారీ అప్పుల్లోకి నెట్టడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిని దెబ్బతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్‌ను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, ఆ పార్టీకి భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, లక్షలాది కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, మూడు కోట్లకు పైగా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సుమారు నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బోనస్ తదితర పథకాల ద్వారా భారీగా నిధులు ఖర్చు చేశామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్రంతో నిరంతరం చర్చించి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తీవ్ర విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, భారీ వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు ఆశించిన ప్రయోజనాలు అందించలేదని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తమ ప్రభుత్వం దాన్ని పూర్తి చేసి మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తుందని తెలిపారు. విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించే విధానాన్ని అమలు చేస్తున్నామని, దళితులు, గిరిజనులు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, రెండున్నరేళ్లలో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మూసీ నది ప్రక్షాళన కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని



అడ్డుకునే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ప్రతిపక్షాలపై మరోసారి విమర్శలు గుప్పించిన రేవంత్ రెడ్డి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని దోపిడీ చేశారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు వాస్తవాలను గుర్తిస్తున్నారని, 2024 నుంచి ప్రారంభమైన కాంగ్రెస్ పాలనకు ప్రజల ఆశీర్వాదం కొనసాగి 2034 వరకు కాంగ్రెస్‌కే అధికారం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

## మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం

మొదటి పేజీ తరువాయి

'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్'ను ప్రదానం చేసింది. హరిత భవిష్యత్తు కోసం ప్రధాని మోదీ దార్శనికతను ఈ అవార్డు గుర్తించింది. ప్రస్తుతం ప్రధాని మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్‌లో ఉన్నారు. ఆ దేశ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యటనలో భాగంగా ఆయన సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో సమావేశమయ్యారు. అంతకుముందు, ప్రధానికి స్టేట్ హౌస్‌లో గౌరవ వందనం లభించింది. ఈ సందర్భంగా, 'మేడ్ ఇన్ ఇండియా' ఫాస్ట్ ప్యాట్రోల్ వెసెల్ పీఎస్ లెస్ప్వార్‌తో పాటు ఆరు అంబులెన్స్‌లు, 10 యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ బోట్లను సీషెల్స్‌కు ప్రధాని మోదీ అందజేశారు. ఈ సహాయం సీషెల్స్ సముద్ర నిఘా సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. అనంతరం ఇరు దేశాల నేతలు కలిసి సీషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన 'కోకో డి మెర్' మొక్కను నాటారు. కాగా, ప్రధాని మోదీకి అంతర్జాతీయ పురస్కారాలు రావడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది మే నెలలో ఆహార భద్రతకు చేసిన సేవలకు గాను ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అత్యున్నత పురస్కారం 'అగ్రికోలా మెడల్' అందుకున్నారు. గతంలో 2018లో సియోల్ శాంతి బహుమతి, ఐక్యరాజ్యసమితి 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' అవార్డులు కూడా ఆయనను వరించాయి.

## 15 వేల మంది హత్యకు కుట్ర!

మొదటి పేజీ తరువాయి

ఇరాన్, ఇరాక్ దేశాలకు 19 సార్లు ప్రయాణించినట్లు విచారణలో తేలింది. అతడి తల్లి, సోదరి ప్రస్తుతం ఇరాన్‌లోనే నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుట్ర వెనుక అంతర్జాతీయ కోణం ఉందా? లేక ఒంటరిగానే ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత కింద హత్యాయత్నం, విషప్రయోగం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## బెంగాల్‌లా తెలంగాణలో!

మొదటి పేజీ తరువాయి

ఘనవిజయాలు సాధించిందని, అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ పోరాడి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్ లక్ష్యంగా దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఆయన ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, నాగర్‌కర్నూలు, వనపర్తి జిల్లాల బీజేపీ నూతన కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా హైదరాబాద్ ఎప్పటికీ బీజేపీ అడ్డానే అని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 3 కార్పొరేషన్లనూ బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ సిటీలో చిన్నపాటి వర్షాలకే రోడ్లు నదులుగా మారుతున్నాయని, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందంటూ మండిపడ్డారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల అక్రమ ఓట్లతో కార్పొరేషన్లను దక్కించుకోవాలని మజ్లిస్ పార్టీ కుట్రలు చేస్తోందని, వారి ప్రయత్నాలను తాము తిప్పికొడతామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు బీజేపీపై పూర్తి నమ్మకముందని, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తమ పార్టీని గెలిపించేందుకు వారు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ అన్నారు. ప్రజల్లో ఉన్న ఆ నమ్మకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ బూత్ అధ్యక్షులపైనే ఉందన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షుల సమన్వయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతోనే హైదరాబాద్ నగరానికి విముక్తి లభించిందన్నారు. అలాగే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో సుష్మా స్వరాజ్ గళమెత్తగా, బీజేపీ శక్తివంచన లేకుండా పోరాడిందని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆ వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారని అన్నారు. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను, ఆరు గ్యారంటీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగులు అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ భావజాలం భారతీయ ఆలోచన కాదని, ఇటలీ ఆలోచన అని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి కేవలం నరేంద్ర మోదీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 2028లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలను బూత్ లెవెల్ కార్యకర్తలు, నేతలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని, వ్యక్తిగత విభేదాలు పక్కనబెట్టి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సమన్వయంతో పనిచేయాలని శ్రేణులకు సూచించారు.

# పవన్‌కు తెలుసేమో అడగండి

## 'ఇడుపు కాయితం' టైటిల్ వివాదంపై కవిత.. తెలంగాణ యాసను రేవంత్ రెడ్డి కాపాడటం లేదని విమర్శ

### ఉప్పల్‌లో జూలై 2న భూపోరాటానికి పిలుపు.. తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని ఆవేదన

ఉప్పల్-హైదరాబాద్, జూన్ 28 (ఈవార్తలు): టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఇడుపు కాయితం' అనే సినిమా టైటిల్‌పై జరుగుతున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, ఆ పదానికి అసలైన అర్థం తెలియాలంటే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అడగాలని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉప్పల్‌లో తన పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఇడుపు కాయితం' సినిమా టైటిల్‌పై సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా తీవ్ర దుమారం రేగుతోంది. ముఖ్యంగా కొందరు ఆంధ్ర నెటిజన్లు తెలంగాణ యాసను, ఈ పదాన్ని కించపరిచేలా ట్రోల్ చేస్తుండటం వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో కవిత స్పందిస్తూ, తెలంగాణ భాష, అస్తిత్వంపై దాడి జరుగుతున్నా కాంగ్రెస్, బీజేపీ, చివరికి సొంత పార్టీ బీఆర్ఎస్ కూడా మౌనంగా ఉండటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "రాష్ట్రంలో మరోసారి ఉద్యమకాలం నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. అప్పుడు మనల్ని, మన భాషను ఎలా అయితే అవాకులు చెవాకులు పేలారో, ఇప్పుడు మళ్లీ అదే తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనమందరం ఈ విషయాన్ని గమనించుకోవాలి. నిన్నగాక మొన్న 'ఇడుపు కాయితం' అనే పేరుతో ఒక సినిమా వచ్చింది. ఈ పేరు అర్థం కావడం లేదంటూ కొందరు దానిపై ట్రోలింగ్ చేస్తున్నారు. తెలంగాణ యాసను అవమానించడమే దీని వెనుక ఉన్న ఉద్దేశం. నేను ఒకటే సూటిగా అడుగుతున్నా... 'ఇడుపు కాయితం' అంటే అర్థం తెలియకపోతే, వెళ్లి సినిమా నటుడు పవన్ కళ్యాణ్‌ను అడగండి. ఆయనకు ఆ పదం అర్థం బాగా తెలుసు, కచ్చితంగా వివరిస్తారు. మా భాషను, యాసను అవహేళన చేసినందుకే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. ఇంకోసారి ఇటువంటి వెకిలి ప్రయత్నాలు చేయకండి. ఒకరి భాషను ఒకరం, ఒకరి సంస్కృతిని ఒకరం గౌరవించుకుందాం. అందరం కలిసే ఉందాం. కానీ, తెలంగాణను అవమానిస్తాం, మా భాషను కించపరుస్తాం అంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ఈరోజు తెలంగాణ భాషను ఇంతగా కించపరుస్తున్నా కాంగ్రెస్ పార్టీ నోరు మెదపదు. ఎందుకంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేదు. ఇక బీజేపీ సంగతి సరేసరి. దేశంలోని సమస్యలు తప్ప, తెలంగాణ గురించి వారికి పట్టదు. బీఆర్ఎస్ పార్టీ కూడా మాట్లాడదు. ఎందుకంటే, అందులో ఓ గుంటనక్క ఉంది. ఆయన వ్యాపారాలన్నీ ఇప్పటికీ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారితోనే ముడిపడి ఉన్నాయి" అని ఆరోపించారు.



## డ్యాన్స్ చేసిందని భార్య, పిల్లల హత్య

**రైలు కింద పడి నిందితుడి ఆత్మహత్య**

**మధ్యప్రదేశ్‌లోని మొరేనా జిల్లాలో ఘటన**

మొరేనా: మధ్యప్రదేశ్‌లోని మొరేనా జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లలను గొడ్డలితో దారుణంగా నరికి చంపాడు. అనంతరం తానూ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాతా బసైయా పోలీస్ స్టేషన్ పరిధిలోని కిషన్‌పూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. బలరామ్ కుష్వాహ్ (35), అతడి భార్య రవితా కుష్వాహ్ (32) మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. పది రోజుల క్రితం గ్రామంలో జరిగిన ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో రవిత డ్యాన్స్ చేసింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోగా, పెద్దలు సర్దిచెప్పి జూన్ 24న తిరిగి అత్తారింటికి పంపించారు. అయినప్పటికీ వారి మధ్య వివాదం సద్దుమణగలేదు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి బలరామ్ తన భార్య, ఇద్దరు మైనర్ కుమారులను గొడ్డలితో నరికి కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం రక్తపు మడుగులో ఉన్న మృతదేహాలను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కొంత సేపటికే బలరామ్ మృతదేహాన్ని కూడా గుర్తించారు. చాలాకాలంగా వీరి మధ్య గృహ హింస, అంతర్గత వివాదాలు ఉన్నాయని, అవే ఈ ఘోరానికి దారితీశాయని మొరేనా డీఎస్పీ విజయ్ భదోరియా ప్రాథమికంగా వెల్లడించారు. పోలీసులు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాల్పులతో దద్దరిల్లిన కరాచీ

**ఆరుగురు ఉగ్రవాదుల హతం**

కరాచీ: పాకిస్థాన్‌లోని అతిపెద్ద నగరమైన కరాచీలో శనివారం భీకర ఉగ్రదాడి జరిగింది. నగరంలోని సింధ్ రేంజర్ల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడి, కాల్పుల ఘటనలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమవగా, మరొకరిని సజీవంగా పట్టుకున్నారు. కరాచీలోని గులిస్తాన్-ఎ-జౌహర్ ప్రాంతంలో ఉన్న సింధ్ రేంజర్ల ప్రధాన కార్యాలయంపైకి ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో దూసుకొచ్చారు. స్థావరాన్ని ఢీకొట్టి వాహనాన్ని పేల్చివేసిన వెంటనే, మిగిలిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు వెంటనే ఎదురుదాడికి దిగడంతో ఆ ప్రాంతం మొత్తం కాల్పుల మోతతో దద్దరిల్లింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు, కమాండోలను రంగంలోకి దించారు. ఈ దాడికి తామే బాధ్యులమని తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) నుంచి విడిపోయిన 'జమాత్-ఉల్-అహ్రార్' అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. పాకిస్థాన్‌లో భద్రతా బలగాలపై ఇటీవలి కాలంలో దాడులు పెరిగిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిపై సింధ్ ముఖ్యమంత్రి సయ్యద్ మురాద్ అలీ షా తీవ్రంగా స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ ఘటనలో సామాన్య పౌరులెవరూ గాయపడలేదని అధికారులు ప్రాథమికంగా తెలిపారు.

## కేతన్ హత్య కేసు..లోహగడ్ కోటలో సీన్ రీకన్‌స్ట్రక్షన్


పుణే: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పుణే రియల్ ఎస్టేట్ వ్యాపారి కేతన్ అగర్వాల్ (26) మృతి కేసులో దర్యాప్తు వేగవంతమైంది. ప్రమాదవశాత్తు కొండపై నుంచి జారిపడి చనిపోయాడని భావించిన ఈ కేసు, పక్కా ప్రణాళికతో జరిగిన హత్యగా తేలడంతో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న కేతన్ కాబోయే భార్య సియా గోయల్ (20), ఆమె ప్రియుడు చేతన్ చౌదరి (22)లను ఆదివారం ఉదయం లోహగడ్ కోటకు తీసుకెళ్లి క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్‌ను నిర్వహించారు. జూన్ 18న లోనావాలా సమీపంలోని లోహగడ్ కోటలో ట్రెకింగ్ చేస్తుండగా కేతన్ అగర్వాల్ సుమారు 350-400 అడుగుల లోయలో పడి మరణించారు. అప్పట్లో ఇది ప్రమాదంగా నమోదైంది. అయితే, దర్యాప్తులో భాగంగా సియా, చేతన్‌ల మధ్య ఉన్న ప్రేమ వ్యవహారం బయటపడింది. నవంబర్‌లో జరగాల్సిన పెళ్లిని తప్పించుకోవడానికే వారిద్దరూ కలిసి కేతన్‌ను హత్య చేయాలని కుట్ర పన్నినట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రణాళిక ప్రకారం, సియా కేతన్‌ను కోటలోని ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లింది. అప్పటికే వారిని అనుసరిస్తున్న చేతన్, సియా నుంచి సైగ అందగానే కేతన్‌ను వెనుక నుంచి బలంగా లోయలోకి తోసేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో, నిందితుల వాంగ్మూలాలను ధ్రువీకరించుకోవడానికి, మరిన్ని ఆధారాలు సేకరించడానికి పోలీసులు ఈరోజు కోట వద్ద క్రైమ్ సీన్ రీక్రియేట్ చేశారు. ఈ ప్రక్రియ కోసం కేతన్ బరువుతో ఉన్న ఒక డమ్మీని కూడా ఉపయోగించినట్లు సమాచారం. పర్యాటకులను కోటలోకి అనుమతించకుండా కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశారు.

# ఇప్పుడు సంతానమే సంపద

**ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునరుద్ధరణ కావాలి**

**పిల్లల పెంపకంలో తండ్రులు బాధ్యత తీసుకోవాలి**

**ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టీకరణ**



అమరావతి, జూన్ 28 (ఈవార్తలు): ఏపీలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ తిరిగి రావాలని, పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని, తండ్రులు కూడా ఆ బాధ్యతను పంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సంతానాన్ని భారంగా చూసే ధోరణి పోయి, వారిని సంపదగా భావించే పరిస్థితి రావాలని ఆయన ఆకాంక్షించారు. జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా ఆదివారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం ముఖ్యమంత్రి చిన్నారుల తల్లిదండ్రులతో ఆప్యాయంగా ముచ్చటించారు. పిల్లలను ఎత్తుకుని ఆడించారు. వారి ఆరోగ్య వివరాలు, వ్యాక్సినేషన్ షెడ్యూల్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయంలో తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు చేసిన ఏర్పాట్లను కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 5 ఏళ్లలోపు వయసున్న సుమారు 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తల్లిదండ్రులతో చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. ఉద్యోగాలు చేసే మహిళలు పిల్లల పెంపకాన్ని ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగారు. "పిల్లల్ని కని, పెంచడం, వారి ఆలనా పాలనా చూడటం ఒక్క తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదు. ఇంట్లో భర్త, ఇతర మగవాళ్లు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండటం వల్ల పిల్లల పెంపకంలో అందరూ భాగస్వాములయ్యేవారని గుర్తుచేశారు. పిల్లలను విలువలతో పెంచడంలో నానమ్మ, తాతయ్యలు కీలక పాత్ర పోషించేవారని అన్నారు. "ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనది. అలాంటి వ్యవస్థ మళ్లీ రావాలి. సంతానాన్ని ఒక సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలి. ఇప్పుడు పరిస్థితులు మారాయి. సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోంది. అందుకే ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ఈ విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కేవీఎన్ చక్రధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సొంత భార్యను పరాయివాడి పడకలోకి!

**20 ఏళ్లుగా పరపురుషులతో లైంగిక దాడి**

**మత్తు ఇచ్చి భార్యపై ఓ భర్త దారుణం**

**13 మంది కామాంధుల పేర్లు చెప్పిన బ్రిటన్ కోర్టు**

లండన్: భార్యకు మత్తుమందు ఇచ్చి, రెండు దశాబ్దాలుగా అనేకమంది పురుషులతో కలిసి ఆమెపై అత్యాచారానికి పాల్పడుతున్నాడో భర్త. బ్రిటన్‌లో జరిగిన ఈ దారుణ ఘటన తాజాగా వెలుగు చూసింది. గ్రేటర్ మాంచెస్టర్‌కు చెందిన అరవై ఏళ్ల పైబడిన వృద్ధుడు ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఇతరుల పేర్లను వెల్లడించకుండా గతంలో ఉన్న ఆంక్షలను కోర్టు తొలగించడంతో ఈ ఉదంతం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ప్రధాన నిందితుడైన భర్త గుర్తింపును, బాధితురాలైన అతడి భార్య భద్రత, గోప్యత నిమిత్తం చట్టప్రకారం గోప్యంగా ఉంచారు. అయితే, అతడు తన భార్యపై జరిగిన 15 లైంగిక నేరాలకు సంబంధించి ఇప్పటికే నేరాన్ని అంగీకరించాడు. ఇందులో ఐదు అత్యాచారాలు, మూడు లైంగిక వేధింపులు, ఆరు దారుణమైన దాడులు, భార్య అనుమతి లేకుండా ప్రైవేట్ చిత్రాలను ఇతరులతో పంచుకున్న నేరాలు ఉన్నాయి. మిగిలిన 33 ఆరోపణలను అతడు తోసిపుచ్చాడు. 2004 నుండి గత ఏడాది అతడు అరెస్ట్ అయ్యే వరకు ఈ ఘోరాలు సాగాయని, భార్య స్పృహలో లేని సమయంలో సహ నిందితులను పిలిపించి ఈ దాడులకు పాల్పడినట్లు ప్రాసిక్యూషన్ పేర్కొంది. నిందితుల వివరాల వెల్లడిపై ఉన్న ఆంక్షలను కోర్టు ఎత్తివేయడంతో, 28 నుండి 73 ఏళ్ల వయసున్న 13 మంది సహ నిందితుల పేర్లు ఇప్పుడు బహిరంగమయ్యాయి. వీరిపై ఉమ్మడి కుట్ర, సామూహిక దాడులకు పాల్పడటం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ఈ దారుణాల్లో నేరుగా పాల్గొనగా, మరికొందరు ఇంటర్నెట్ వేదికగా ఈ అకృత్యాలను ప్రోత్సహించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నిందితులలో చాలామంది తమపై వచ్చిన ఆరోపణలను తిరస్కరించారు. ప్రస్తుతం వీరిలో ఐదుగురికి బెయిల్ లభించగా, మిగిలిన వారు పోలీసు కస్టడీలోనే ఉన్నారు. ప్రధాన నిందితుడితో పాటు ఈ 12 మంది సహ నిందితులకు మాంచెస్టర్‌లోని మిన్షుల్ స్ట్రీట్ క్రౌన్ కోర్టులో సెప్టెంబరులో తుది విచారణ జరగనుంది. బాధితురాలి రక్షణకు బ్రిటన్ అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. న్యాయ ప్రక్రియ సజావుగా సాగుతున్న తరుణంలో, సమాజంలో ఇటువంటి నేరాలపై అవగాహన పెంచేందుకు కోర్టు ఈ ఆంక్షలను సడలించింది. సుదీర్ఘకాలం పాటు సాగిన ఇటువంటి క్రూరమైన లైంగిక నేరాల నెట్‌వర్క్‌లను ఛేదించడంలో ఈ కేసు దర్యాప్తు అత్యంత కీలకమైనదిగా మారింది.

## వాట్సాప్ వెబ్‌లో మాల్వేర్!

**హ్యాకర్ల సరికొత్త ఎత్తుగడ.. యూజర్లకు బిగ్ అలర్ట్**

న్యూఢిల్లీ: వాట్సాప్ వెబ్ యూజర్లకు భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ హెచ్చరికలు జారీ చేసింది. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో వాట్సప్ వెబ్ లేదా వాట్సప్ డెస్క్‌టాప్ యాప్‌లను ఉపయోగించే వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు పెద్ద ఎత్తున మాల్‌వేర్‌ను వ్యాప్తి చేస్తున్నట్లు సెర్ట్-ఇన్ తీవ్రంగా హెచ్చరించింది. హ్యాకర్లు యూజర్ల డివైజ్‌లను అనుమతి లేకుండా, అనధికారికంగా యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో, మనకు బాగా తెలిసిన స్నేహితులు, కొలీగ్స్, కుటుంబ సభ్యుల నుండి వచ్చే వాట్సప్ మెసేజ్‌లు, వాటిలోని అటాచ్‌మెంట్ల విషయంలో కూడా అత్యంత అప్రమత్తంగా ఉండాలని వినియోగదారులకు సూచించింది. సైబర్ నేరగాళ్లు ఈ మాల్‌వేర్ దాడి కోసం విజువల్ బేసిక్ స్క్రిప్ట్ ఫైల్స్ అనే ప్రమాదకరమైన ఫైళ్లను ఉపయోగిస్తున్నట్లు సెర్ట్-ఇన్ గుర్తించింది. ఇందుకోసం వారు ఇప్పటికే హ్యాక్ చేసిన వాట్సప్ ఖాతాల నుండి ఆయా యూజర్ల కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న ఇతరులకు ఈ అటాచ్‌మెంట్లను పంపుతున్నారు. మనకు తెలిసిన కాంటాక్ట్ నుంచే మెసేజ్ రావడంతో యూజర్లు సాధారణంగా ఎలాంటి అనుమానం లేకుండా ఆ ఫైళ్లను ఓపెన్ చేస్తారని హ్యాకర్లు ఈ ఎత్తుగడ వేశారు. ఒకసారి పొరపాటున ఆ విజువల్ బేసిక్ స్క్రిప్ట్ ఫైల్‌ను క్లిక్ చేసి ఓపెన్ చేస్తే.. మీరు వాడుతున్న కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ పూర్తిగా హ్యాకర్ల నియంత్రణలోకి వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ మాల్‌వేర్ మీ డివైజ్‌లోకి ప్రవేశించిన తర్వాత, హ్యాకర్లు ఎక్కడో దూరంగా కూర్చుని మీ కంప్యూటర్‌ను రిమోట్‌గా నియంత్రిస్తారు. సిస్టమ్‌లో దాచి ఉంచిన మీ బ్యాంకింగ్, సోషల్ మీడియా తదితర ముఖ్యమైన పాస్‌వర్డ్‌లను దొంగిలించడంతో పాటు, డివైజ్‌లోని డేటాను హ్యాక్ చేయడానికి ఇతర మాల్‌వేర్‌లను కూడా జొప్పించే అవకాశం ఉందని సెర్ట్-ఇన్ వివరించింది.

## 'రాహుల్‌గాంధీ కనిపించుట లేదు!'

**ఢిల్లీ అంతటా వెలసిన పోస్టర్‌లు**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ కలకలం రేగింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'కనిపించడం లేదు' (మిస్సింగ్) అంటూ ఆదివారం ఢిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో వెలిసిన పోస్టర్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాహుల్‌గాంధీ తాజా విదేశీ పర్యటనను లక్ష్యంగా చేసుకుని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో ఈ పరిణామం సరికొత్త మలుపు తిప్పింది. ఢిల్లీలోని ఫిరోజ్‌షా రోడ్డుతోపాటు పలు ప్రధాన కూడళ్లలో రాహుల్‌గాంధీ ఫొటోతో కూడిన 'మిస్సింగ్' పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. అయితే ఈ పోస్టర్లను ఎవరు అంటించారనేది ప్రస్తుతానికి స్పష్టంగా తెలియరాలేదు. పార్లమెంట్ సమావేశాలు, కీలక ఎన్నికలు, లేదా పార్టీ అంతర్గత ప్రాముఖ్యత కలిగిన సమయాల్లో రాహుల్‌గాంధీ దేశంలో ఉండరంటూ శనివారం నుంచే బీజేపీ తన విమర్శల పదును పెంచిన మరుసటి రోజే ఈ పోస్టర్లు కలకలం రేపడం గమనార్హం. ఈ అంశంపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా కాంగ్రెస్ ఎంపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్‌గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత పదవిని 'లీడర్ ఆఫ్ పర్యటన్ అండ్ పార్టీయింగ్' గా మార్చేశారని ఎద్దేవాచేశారు. పార్లమెంట్ నడుస్తున్నప్పుడు లేదా దేశానికి, సొంత పార్టీకి ఆయన అవసరం ఉన్నప్పుడల్లా విదేశాలకు వెళ్లడం రాహుల్‌కు అలవాటుగా మారిందని, ప్రజల కంటే ఆయన టూరిజానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## మెటాలో జెమినీ వాడకం కట్!

**ఏఐ మోడళ్ల వాడకంపై పరిమితులు**

**మెటా అంతర్గత ఏఐ ప్రాజెక్టులపై ప్రభావం**

న్యూయార్క్: టెక్ దిగ్గజం గూగుల్, సోషల్ మీడియా సంస్థ మెటాకు ఊహించని షాక్ ఇచ్చింది. తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మోడల్ అయిన 'జెమినీ' వాడకంపై మెటాకు పరిమితులు విధించింది. ఏఐ ప్రాజెక్టుల కోసం మెటా అడిగినంత భారీ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అందించడంలో గూగుల్ విఫలం కావడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామం టెక్నాలజీ పరిశ్రమలో ఏఐ వనరుల కోసం పెరుగుతున్న తీవ్రమైన ఒత్తిడిని మరోసారి బహిర్గతం చేసింది. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం ఈ ఏడాది మార్చి నుంచే ఈ పరిమితులు అమల్లోకి వచ్చాయి. గూగుల్ ఏఐ సేవలను అత్యధికంగా వినియోగించుకుంటున్న అతిపెద్ద కస్టమర్లలో మెటా ఒకటి. అయితే, జెమినీ ఏఐ మోడళ్ల కోసం మెటా నుంచి అసాధారణ స్థాయిలో డిమాండ్ రావడంతో, గూగుల్ తన వద్ద ఉన్న వనరులతో ఆ డిమాండ్‌ను అందుకోలేకపోయింది. ఈ సామర్థ్య కొరత కారణంగా మెటా అంతర్గతంగా చేపడుతున్న పలు కీలక ఏఐ ప్రాజెక్టులు ఆలస్యం కావడమే కాకుండా, కొన్నింటికి అంతరాయం కూడా ఏర్పడినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన మెటా, తమ ఉద్యోగులు ఏఐ వనరులను, ముఖ్యంగా ఏఐ వాడకాన్ని కొలిచే యూనిట్లయిన 'ఏఐ టోకెన్ల' వినియోగాన్ని తగ్గించుకోవాలని, వాటిని మరింత సమర్థవంతంగా ఉపయోగించాలని సూచనలు జారీ చేసింది. ఈ సమస్య కేవలం మెటాకు మాత్రమే పరిమితం కాలేదు. గూగుల్ క్లౌడ్ సేవలను వినియోగించుకుంటున్న మరికొన్ని కంపెనీలు సైతం ఇలాంటి పరిమితులనే ఎదుర్కొంటున్నప్పటికీ, మెటాపై పడిన ప్రభావం చాలా తీవ్రంగా ఉందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం టెక్ కంపెనీలన్నీ ఏఐ సామర్థ్యాలను పెంచుకోవడంపై భారీగా దృష్టి సారించాయి. డేటా సెంటర్లు, అత్యాధునిక చిప్‌ల కోసం బిలియన్ల డాలర్లు పెట్టుబడులుగా పెడుతున్నప్పటికీ, ఏఐ కంప్యూటింగ్ శక్తికి ఉన్న డిమాండ్‌ను అందుకోవడంలో సరఫరా వెనుకబడిపోతోంది. ఈ సవాళ్లను గూగుల్ సైతం అధికారికంగా అంగీకరించింది. కంపెనీ తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాట్లాడుతూ, కంప్యూటింగ్ సామర్థ్య పరిమితుల కారణంగా తమ క్లౌడ్ విభాగం వృద్ధి మరింత బలంగా నమోదు కాలేదని తెలిపారు. ఇదే కారణంతో తమ క్లౌడ్ విభాగం బ్యాక్‌లాగ్ (చేపట్టాల్సిన పనుల జాబితా) గణనీయంగా పెరిగిందని ఆయన వివరించారు. మొత్తం మీద జనరేటివ్ ఏఐ రంగంలో కంపెనీలు వేగంగా దూసుకెళుతున్నప్పటికీ, అందుకు అవసరమైన మౌలిక వసతుల కొరత పరిశ్రమకు అతిపెద్ద అవరోధంగా మారుతోందని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది.

## అమెరికాలో వరదలు... ఏపీ యువకుడు గల్లంతు

బాపట్ల, జూన్ 28 (ఈవార్తలు): అమెరికాలో జరిగిన ఓ దురదృష్టకర సంఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడు గల్లంతయ్యాడు. బాపట్ల జిల్లాకు చెందిన దొప్పలపూడి వెంకటేశ్, కాన్సాస్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయినట్లు అక్కడి నుంచి వస్తున్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళ్తే, బాపట్ల జిల్లా పరుచూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన దొప్పలపూడి రాంబాబు కుమారుడైన వెంకటేశ్, అమెరికాలోని నెబ్రాస్కా రాష్ట్రం ఒమాహాలో నివసిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కాన్సాస్‌లోని సమ్నర్ కౌంటీ వెల్లింగ్టన్ ప్రాంతంలో కారులో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా ఎస్. ఆలివర్ రోడ్ సమీపంలో ఒక్కసారిగా వచ్చిన వరద ప్రవాహంలో అతడి కారు కొట్టుకుపోయింది.

VANGS
GLOBAL TECHNOLOGIES LLP

# POWERING NEWS DIGITALLY

Smart CMS & Digital Solutions for Modern News Businesses




## 1 News Paper CMS

Manage, publish & distribute newspapers efficiently with our powerful CMS.

## 2 News Website CMS

Create dynamic, fast & SEO-friendly news websites with ease.

## 3 Mobile App Development

Engage your audience on the go with feature-rich news mobile apps.

Fast & Reliable | Secure & Scalable | Responsive Design | Easy to Use & Manage

VANGS GLOBAL TECHNOLOGIES
Contact: +91 76750 87378

News Paper CMS | News Website CMS | Mobile App Development

# పోలియో రహిత సమాజమే లక్ష్యం

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్**



జగిత్యాల, జూన్ 28 (ఈవార్తలు): ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించి పోలియో రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం జగిత్యాల పట్టణంలోని మోతెవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ దేశం పోలియో నిర్మూలనలో చారిత్రాత్మక విజయాన్ని సాధించినప్పటికీ, ఆ విజయాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. పోలియో చుక్కలు పూర్తిగా సురక్షితమైనవని, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత అవసరమని తెలిపారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలియో రహిత భారతదేశాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. పోలియో రహిత జగిత్యాల జిల్లాగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని పోలియో కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, పోలియో బూత్‌లలో కార్యక్రమం సజావుగా కొనసాగుతోందని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య రక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వబోమన్నారు. పోలియో నివారణలో ప్రతి డోస్ ఎంతో విలువైనదని చెప్పారు. ప్రజలు అపోహలను నమ్మకుండా ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల భవిష్యత్తు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పోలియో చుక్కలు అత్యంత ప్రభావవంతమైన రక్షణ అని వివరించారు. ఆరోగ్య శాఖ సిబ్బంది సేవలను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ అభినందించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పోలియో బూత్ వద్ద అవసరమైన మందులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సుజాత, వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా జర్నలిస్టులకు మీడియా అవార్డుల ప్రధానోత్సవం

విశాఖపట్నం, జూన్ 28 (ఈవార్తలు): ప్రతిభకు ప్రోత్సాహం పేరిట వైజాగ్ మీడియా అవార్డ్స్ కార్యక్రమాన్ని విశాఖ నగర పరిధిలోని సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు జర్నలిస్టులకు జర్నలిస్టులకు అవార్డులను, చదువుల్లో ప్రతిభ జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. పలు కేటగిరీలో అందించిన ఈ అవార్డులను పలువురు సీనియర్ జర్నలిస్టులకు అందించారు. డెడికేటెడ్ జర్నలిస్ట్ క్యాటగిరిలో ఆంధ్రజ్యోతి సీనియర్స్ స్టాఫ్ రిపోర్టర్ బూటు శ్రీనివాస్ కు అవార్డును ప్రధానం చేశారు. ఈ అవార్డును బీజేపీ అధికార ప్రతినిధి, మాజీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఇతర ముఖ్య అతిథులు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యులయ్యే జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రతీ ఏటా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ చైర్మన్ గంట్ల శ్రీనుబాబు, చైర్మన్ నాగరాజు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న శ్రీనివాస్ ను పలువురు అభినందించారు.

## జనసేనలో కంటెంట్ రైటర్ పోస్టులు

**జూలై 5 వరకు దరఖాస్తుకు అవకాశం**

హైదరాబాద్, జూన్ 28 (ఈవార్తలు): మీకు సమకాలీన రాజకీయ పరిణామాలపై అవగాహన ఉందా.. సామాజిక అంశాలపై స్పృహ ఉందా.. పాలనాపరమైన విషయాలపై పట్టు ఉందా.. అలాంటి వారికి జనసేన పార్టీ అద్భుత అవకాశం కల్పిస్తోంది. కంటెంట్ రైటర్లు ఛాన్స్ ఇస్తోంది. సమకాలీన సామాజిక, రాజకీయ, పాలనాపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండి, తెలుగు లేదా ఇంగ్లీష్ భాషలలో రాయగలిగే వారికి కంటెట్ రైటర్లుగా అవకాశం కల్పిస్తున్నట్లు.. జనసేన పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆయా భాషలలో రాయగలిగి, కంటెంట్ రూపొదించాలనే ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. తమకు ఆసక్తి, పట్టు ఉన్న అంశాలపై కంటెంట్ రూపొందించవచ్చని జనసేన పార్టీ ప్రకటనలో వెల్లడించింది. జనసేన పార్టీలోని మీడియా, సోషల్ మీడియాలో విభాగాలతో కలిసి పనిచేస్తూ కంటెంట్ రైటర్లుగా సేవలు అందించాల్సి ఉంటుందని ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. మరోవైపు కంటెంట్ రైటర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోదలిచిన వారు జూలై ఐదో తేదీలోపు తమ దరఖాస్తులను పంపించాల్సి ఉంటుంది. అలాగే దరఖాస్తు చేసేవారు తమ బయోడేటా వివరాలతో పాటుగా ఏదైనా సమకాలీన రాజకీయ, సామాజిక, పాలనాపరమైన అంశాలపై వ్యాసం రాసి పంపాలని సూచించింది. 200 పదాలకు మించకుండా ఈ వ్యాసం ఉండాలని ప్రకటనలో వెల్లడించింది. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ప్రకటన విడుదలైంది. మరోవైపు ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో ఆండ్రాయిడ్ ఫోన్ల వాడకం ఎక్కువైంది. యువత నుంచి పెద్ద వయస్కుల వరకూ స్మార్ట్ ఫోన్లు ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సిద్ధాంతాలను, విధానాలను వారికి చేరువ చేసేందుకు సోషల్ మీడియాను ప్రధాన ఆయుధంగా ఉపయోగించుకోవాలని జనసేన భావిస్తోంది. సోషల్ మీడియా కంటెంట్ ద్వారా జనసేన వైపు ఆకర్షించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే కంటెంట్ రైటర్లను నియమించుకునే పనిలో ఉంది జనసేన పార్టీ. సమకాలీన అంశాలతో పాటు ప్రత్యర్థులపై కౌంటర్లు వేసేందుకు ఈ కంటెంట్ రైటర్ల సేవలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది.

## బజ్జీలు తిని 50 మందికి అస్వస్థత

కాకినాడ, జూన్ 28 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా దుగ్గుదుర్రు గ్రామంలో ఫుడ్ పాయిజన్ అయింది. సుమారు 50 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని స్థానిక పీహెచ్ సీకి తరలించారు. ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే నిన్న ఓ హోటల్‌లో బజ్జీలు తిన్నామని, ఆ తర్వాత నుంచి వాంతులు, విరేచనాలు అయ్యాయని బాధితులు చెప్పారు. ఈ ఘటన ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించింది. హోటల్‌లో తిన్న బజ్జీల వల్లేనా..? మరేదైనా కారణాల ఉన్నాయా అనే కోణంలో అధికారులు పరిశీలన చేస్తున్నారు. మరోవైపు విషయం తెలియడంలో రాత్రికి రాత్రే హోటల్ మూసేసి యాజమాన్యం పరారైంది. సమాచారం తెలుసుకున్న వైద్యారోగ్య శాఖ వెంటనే రంగంలోకి దిగింది. పీహెచ్ సీలో చికిత్స పొందుతున్న బాధితులను అధికారులు పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని పీహెచ్‌సీ అధికారులను ఆదేశించారు. మరికొందరి లక్షణాలున్నాయా కోణంలో దుగ్గుదుర్రు గ్రామంలో విచారణ చేపట్టారు. ప్రత్యేక టీమ్ గ్రామంలో పర్యటిస్తోంది. హోటల్ లో వాడిన నూనె, ఇతర పదార్థాల నాణ్యత లోపం వల్లే ఇలా జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

## ముషీరాబాద్‌లో పోలియో చుక్కల పంపిణీ

**పోలియో నిర్మూలనకు తల్లిదండ్రులు సహకరించాలి: డా. మనోజ్ రెడ్డి**

ముషీరాబాద్, జూన్ 28 (ఈవార్తలు): ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. మనోజ్ రెడ్డి స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి కుటుంబం ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన ప్రశంసించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, తల్లిదండ్రులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ముగిసిన అండర్ 19 బ్యాడ్మింటన్ పోటీలు

**విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన చాముండేశ్వరనాథ్**



హైదరాబాద్, జూన్ 28 (ఈవార్తలు): హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అదిరా బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన యోనెక్స్--సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ (అండర్--19) బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026 ఆదివారం ఘనంగా ముగిసింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన యువ షట్లర్లు ఉత్కంఠభరిత పోటీల్లో తమ ప్రతిభను చాటుకొని ప్రేక్షకులను అలరించారు. బాలుర సింగిల్స్‌లో అఖిల్ రెడ్డి బొబ్బా (రంగారెడ్డి) విజేతగా నిలవగా, బాలికల సింగిల్స్‌లో అవని విక్రమ్ గోవింద్ (రంగారెడ్డి) ఛాంపియన్‌గా అవతరించింది. బాలుర డబుల్స్‌లో సాయి సిద్ధార్థ్ రాయప్రోలు (హైదరాబాద్), శౌర్య కిరణ్ జె. (వరంగల్) జోడీ టైటిల్‌ను కైవసం చేసుకోగా, బాలికల డబుల్స్‌లో ఆరాధ్య రెడ్డి హనుమయ్యగారి, అక్షయ చౌదరి ఆలూరు (కామారెడ్డి) జోడీ విజేతగా నిలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాయి సిద్ధార్థ్ రాయప్రోలు, లక్ష్మీ రిధిమ దేవినేని (హైదరాబాద్) జోడీ అద్భుత ప్రదర్శనతో ఛాంపియన్‌గా నిలిచి ప్రశంసలు అందుకుంది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో హైదరాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. చాముండేశ్వరనాథ్ విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రూజాన్ సోలార్ సీఈఓ జక్కుల శ్రీనివాస్, హైదరాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి కనూరి వంశీధర్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ (ఈవెంట్స్ ఙ ప్రోటోకాల్) యూ.వి.ఎన్. బాబు, హైదరాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యురాలు తారా ప్రశాంత్ చంద్ర, అదిరా బ్యాడ్మింటన్ అకాడమీ ప్రమోటర్ ఓనర్ శిఖరం శ్రీనివాస్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అబ్జర్వర్ పీ. సుధాకర్, జాయింట్ సెక్రటరీ ఎల్. రవికుమార్, హైదరాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యుడు బంగారు బాబు, కోశాధికారి నాగవేణి పాల్గొని విజేతలను అభినందించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ, భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు.



## మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై తనిఖీ

మల్కాజ్‌గిరి, జూన్ 28 (ఈవార్తలు): మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే సీఏఓ/ఆర్ఎస్ సందీప్ జైన్, సీపీఎం ఎల్. సాంబశివరావు శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించిన అధికారులు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎంటీఎస్ ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు నూర్ సందీప్ జైన్‌కు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్‌ను ప్రయాణికులు ఊహించని రీతిలో ఆధునిక విద్యుత్ అలంకరణతో తీర్చిదిద్దుతున్న రైల్వే అధికారులకు నూర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తయితే ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి. ప్రసాదరావు, సమీర్ కుమార్, బి. వెంకటేశ్వర్ రావు, గతి శక్తి ప్రతినిధులు, నాగేశ్వర్ రావు, సాయినాథ్ (ఎలక్ట్రికల్), నాగార్జున (ఇండ్‌వెల్), వీరభద్రయ్య, వివేక్ (సివిల్ వర్క్స్), యుగంధర్ (ఎలివేషన్ వర్క్స్) తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం



చిన్నారి మానస్ విక్రాంత్‌కు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

హనుమకొండ, జూన్ 28 (ఈవార్తలు): హనుమకొండలోని చక్రివర్తి హాస్పిటల్ సమీపంలో ఏఎన్ఎమ్ సువర్ణ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య సిబ్బంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలందరూ సహకరించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

## అమరావతిలో తప్పులు

ఉండవల్లి, జూన్ 28 (ఈవార్తలు): అమరావతిలో తప్పులు జరుగుతున్నాయి కాబట్టే ప్రభుత్వం ఉలిక్కిపడుతోందని మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఉండవల్లిలో జరిగిన ఘటనపై వైసీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేయడంపై ఆయన స్పందించారు.




## శ్రీ సూర్య ధన్వంతరి ఆలయంలో ప్రత్యేక పూజలు


జగిత్యాల, జూన్ 28 (ఈవార్తలు): జ్యేష్ఠ మాస శుక్ల పక్ష చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాలలోని శ్రీ సూర్య ధన్వంతరి ఉషా-ఛాయ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర్వహించిన అనంతరం విశేష పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉచితంగా అమృత నిర్గుండి కషాయం పంపిణీ చేశారు. అలాగే భక్తులు స్వామివారికి ముడుపులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఆదివారం సూర్యభగవానునికి అంకితమైన పవిత్రమైన రోజని, ఈ రోజున సూర్యనారాయణ స్వామిని ఆరాధించడం వల్ల ఆరోగ్యం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం, విజయాలు, కీర్తి కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్టు రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ గట్టు రాజేందర్, సహాయ కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్, పెద్ది శ్రీనివాస్, యాంసాని శంకరయ్య, తాటిపల్లి ప్రవీణ్ కుమార్, మహేందర్, పూర్ణచందర్, హరీష్, ఆలయ అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం పలుకుతోంది..
నేటి ఈవార్తలు
సంచలనాత్మక కథనాలు, వాస్తవ సమాచారాన్ని అందిస్తూ ప్రధాన పత్రికలకు దీటుగా అతి తక్కువ కాలంలోనే తెలుగు పాఠకుల ఆదరాభిమానాలు సంపాదించిన 'ఈవార్తలు' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణవ్యాప్తంగా విలేకరులు కావలెను.
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
ఆసక్తి కలిగినవారు బయోడేటాను
9440455811కు వాట్సాప్
contact@evarthalu.comకు మెయిల్ గానీ చేయవచ్చు.

ఒయ్యారి చిత్రం






## అనిరుధ్-కావ్యల పెళ్లి నిజమే!

కోలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) అధినేత కావ్య మారన్ త్వరలోనే ఒక్కటి కాబోతున్నారంటూ చాలాకాలంగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఇప్పుడు మరింత బలం చేకూరింది. తమిళ సీనియర్ నటుడు, నాటక రంగ దిగ్గజం వై.జి. మహేంద్రన్ ఈ జంట వివాహంపై చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఓ ఇంటర్వ్యూలో ఆయన అనిరుధ్, కావ్యల గురించి మాట్లాడుతూ.. వారి వివాహం జరగడం ఖాయమన్నట్టుగా సంకేతాలు ఇచ్చారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వై.జి. మహేంద్రన్ మాట్లాడుతూ.. "అనిరుధ్ చాలా మంచివాడు, సాఫ్ట్ బాయ్. ఎంతో సమర్థుడు. అయితే, ఏదో ఒక విషయం అతడిని పెళ్లి వైపు అడుగులు వేయకుండా ఆపుతోంది. ఆ అడ్డంకులు త్వరలోనే తొలగిపోతాయని ఆశిస్తున్నా" అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. అనిరుధ్ త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నాడని, అతనికి తన శుభాకాంక్షలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. "నేను కూడా విన్నదాన్నే చెబుతున్నాను. కానీ, ఈ వివాహం కచ్చితంగా జరుగుతుందని నేను నమ్ముతున్నాను. వారిద్దరి జోడీ చూడటానికి చాలా అద్భుతంగా ఉంటుంది. కచ్చితంగా మంచి జంటగా పేరు తెచ్చుకుంటారు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## స్వీయ దర్శకత్వంలో రామ్ కొత్త సినిమా

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగానే కాకుండా ఇప్పుడు దర్శకుడిగా కూడా తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న కొత్త చిత్రం 'రాపో23' సోమవారం గ్రాండ్ పూజా కార్యక్రమంతో అధికారికంగా ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. ఈ సినిమాకు రామ్ పోతినేని కేవలం హీరో, దర్శకుడే కాదు.. కథ కూడా ఆయనే అందిస్తుండటం విశేషం. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కనుంది. రామ్ పోతినేని సోదరుడు కృష్ణ పోతినేని 'రాపో సినిమాటిక్స్' అనే సొంత బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ తిరు ఈ చిత్రానికి కెమెరామెన్‌గా పనిచేయనున్నారు. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



## శ్రీహరి తనయుడి 'స్టూడెంట్' టీజర్

దివంగత రియల్ స్టార్ శ్రీహరి వారసుడిగా సినీ రంగంలో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్న యువ హీరో మేఘాంశ్ శ్రీహరి, తన కొత్త చిత్రం 'స్టూడెంట్' (ఛూ్బసవత్)తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. క్యాంపస్ రాజకీయాల నేపథ్యంలో సాగే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది.



పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలతో నిండిన ఈ టీజర్, సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచింది. ఈ చిత్రంలో మేఘాంశ్ శ్రీహరి ఓ విద్యార్థి నాయకుడిగా ఇంటెన్స్ మాస్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నాడు. ఆయన సరసన విజేత పరీక్ కథానాయికగా నటిస్తోంది. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జోవికా సినిమాస్, చెరిష్ మీడియా వర్క్స్ పతాకాలపై బెల్లం సిద్ధారెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణలు, రాజకీయాలతో పాటు చిత్రంలో ఓ అందమైన ప్రేమకథ కూడా ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది. ప్రేమ్ చంద్ కంచర్ల ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, శ్రీనివాస్ బెజుగం సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.

## దర్శకుడు భాగ్యరాజ్ కళ్లు దానం

ప్రముఖ తమిళ సినీ దర్శకుడు, రచయిత, నటుడు కె. భాగ్యరాజ్ (73) శనివారం కన్నుమూశారు. మరణంలోనూ ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. తన చివరి కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన కళ్లను దానం చేసి, ఇద్దరికి చూపును ప్రసాదించారు. ఈ ఉదాత్తమైన చర్య ద్వారా ఆయన ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే, శనివారం చెన్నైలోని తన నివాసంలో ఉన్న భాగ్యరాజ్‌కు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ను గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. భాగ్యరాజ్ మరణానంతరం ఆయన చివరి కోరికను గౌరవిస్తూ, కుటుంబ సభ్యులు రోటరీ రాజన్ ఐ బ్యాంక్ వైద్యులకు సమాచారం అందించారు. వైద్య బృందం నుంగంబాక్కంలోని ఆయన నివాసానికి చేరుకుని నేత్రదాన ప్రక్రియను పూర్తి చేసింది. 'స్క్రీన్‌ప్లే కింగ్'గా పేరుగాంచిన భాగ్యరాజ్, తన గురువు భారతీరాజా వద్ద సహాయకుడిగా సినీ జీవితాన్ని ప్రారంభించారు. తనదైన కథాకథనాలతో, హాస్యంతో కూడిన సామాజిక చిత్రాలతో తమిళ ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. కొద్ది రోజుల క్రితమే భారతీరాజా మరణించగా, ఇప్పుడు భాగ్యరాజ్ కూడా దూరమవ్వడంతో తమిళ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది.





## ఆడది మందు తాగితే తప్పేంటి

టాలీవుడ్ నటి, బీజేపీ నేత మాధవీలత మరోసారి సోషల్ మీడియాలో హాట్ కామెంట్స్ చేసింది. మగాడు మందు తాగితే చాలా నార్మల్, అదే ఆడది తాగితే బరితెగించిందని అంటారని పేర్కొంది. ఆడది ఇంటిపని చేస్తే సంప్రదాయిని అని అదే మగాడు చేస్తే చేతకాని వెదవ, ఆడంగులోడు అంటారని మండిపడింది. అసలు మందు తాగడమే తప్పు అయితే ఎవరు తాగినా తప్పు అనారోగ్యం అని చెప్పింది. అలాగే ఇళ్లు మనది అయినప్పుడు ఇంటిపని కూడా ఇద్దరి బాధ్యతనే కానీ సిగ్గులేని తనం ఎప్పుడు అయ్యిందని ప్రశ్నించింది. దీనిపై ఆలోచన చేయాలని పేర్కొంది. ప్రస్తుతం మాధవీలత పోస్టు వైరల్ అవ్వడంతో నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తున్నారు.




## సిగ్గుతో తల వంచుకోవాలి

ప్రియదర్శి, నాగ దుర్గ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం'. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సుకుమార్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ మూవీని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. టైటిల్ మోషన్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. అయితే 'ఇడుపు కాయితం' టైటిల్ పై కొందరు కావాలని సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. దీనిపై తాజాగా సీనియర్ నటుడు వీకే నరేష్ స్పందించారు. 'ఇడుపు కాయితం' వివాదాన్ని జాతీయ సమస్య చేశారని నరేష్ అన్నారు. దీన్ని వివాదంగా మార్చినందుకు మనందరం సిగ్గు పడాలని కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగు మాండలికాన్ని అవమానించొద్దని, సినిమాను సినిమాగానే చూడాలని హితవు పలికారు. 'కరుప్పు', 'కాంతార' వంటి పదాల అర్థాలు తెలియకపోయినా ఆయా సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించి, తెలుగు భాషను కాపాడుకుందామని పేర్కొన్నారు. దయచేసి మన తెలుగు భాషా మాండలికాలను తక్కువ చేయడం లేదా అవమానించడం మానేయండి అంటూ నరేష్ ఓ వీడియో రిలీజ్ చేశారు. నరేష్ మాట్లాడుతూ.. "నేను రెండు రోజులుగా చూస్తున్నా. 'ఇడుపు కాయితం' కాంట్రవర్సీని నేషనల్ ఇష్యూగా చేస్తున్నారు. సినిమా వాడిగా ఒక సినిమాకి అటెన్షన్ ఇస్తున్నందుకు సంతోష పడతాను కానీ.. మన తెలుగు భాషలో ఒక మాండలికాన్ని కోట్ల మందిలో ఎవడో ఒక నెటిజన్ కామెంట్ చేశాడని, దాన్ని ఇంత ఇష్యూ చేసి ఒక గొప్ప మాండలికాన్ని అవమానించడం తెలుగువారిగా

## షారూఖ్ చెల్లిగా సాదియా

బాలీవుడ్ కల్ట్ క్లాసిక్ చిత్రం 'కభీ హా కభీ నా' (1994)లో షారూఖ్ ఖాన్ సోదరిగా నటించిన నటి సాదియా సిద్దిఖీ ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. ఆ చిత్రంలో చెల్లెలి పాత్రను తాను మొదట తిరస్కరించానని, దానికి కారణం షారూఖ్‌పై తనకున్న విపరీతమైన ప్రేమేనని ఆమె తెలిపారు. ఆయన ప్రేయసిగా నటించాలని బలంగా కోరుకున్నట్లు చెప్పారు. కుందన్ షా దర్శకత్వంలో వచ్చిన ఈ రొమాంటిక్ డ్రామాలో షారూఖ్ ఖాన్, సుచిత్రా కృష్ణమూర్తి ప్రధాన పాత్రల్లో నటించారు. 'హమ్రాహీ' అనే దూరదర్శన్ సీరియల్‌లో సాదియాను చూసిన దర్శకుడు, ఆమెను షారూఖ్ సోదరి 'నిక్కీ' పాత్ర కోసం సంప్రదించారు. దీనిపై సాదియా ఇటీవల మాట్లాడుతూ.. "నన్ను సినిమా కోసం పిలిచినప్పుడు, నేను అప్పటికే షారూఖ్ ప్రేమలో మునిగిపోయి ఉన్నాను. ఆయన తప్ప నాకు వేరే ఎవరూ కనిపించేవారు కాదు. ఆయన్ని ప్రేమించాను, ఇప్పటికీ ప్రేమిస్తున్నాను" అని అన్నారు. ఈ విషయాన్ని తాను నేరుగా షారూఖ్‌తోనే చెప్పానని, "నాలో మీకు చెల్లెలి భావన కనిపించదు, నా హావభావాలు వేరేగా ఉంటాయి" అని చెప్పగా ఆయన నవ్వేశారని సాదియా గుర్తుచేసుకున్నారు.









# టీమిండియాపై ఐర్లాండ్ క్లీన్ స్వీప్

**రెండో టీ20లో ఒక్క పరుగు తేడాతో గెలుపు.. భారత్ 16 సిరీస్‌ల విజయాల జైత్రయాత్రకు అడ్డుకట్ట**



పసికూన ఐర్లాండ్ చేతిలో టీ20 ప్రపంచ ఛాంపియన్ భారత్‌కు అనూహ్య పరాభవం ఎదురైంది. బెల్‌ఫాస్ట్ వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఐర్లాండ్ ఒక్క పరుగు తేడాతో సంచలన విజయం సాధించింది. ఆఖరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో గెలిచి, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. ఈ ఓటమితో టీమిండియా 16 సిరీస్‌ల విజయాల జైత్రయాత్రకు తెరపడింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకోగా, తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. ఆ జట్టులో హ్యారీ టెక్టర్ (47 బంతుల్లో 53) హాఫ్ సెంచరీతో రాణించగా, బెంజమిన్ కాలిట్జ్ (23 బంతుల్లో 37) కీలక పరుగులు జోడించాడు. భారత బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు పడగొట్టగా, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం 155 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, ఆదిలోనే వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. తిలక్ వర్మ (46 బంతుల్లో 55) ఒంటరి పోరాటం చేసినప్పటికీ, ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు. చివరి ఓవర్లలో హర్షిత్ రాణా (10 బంతుల్లో 21) మెరుపులు మెరిపించినా, భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 153 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఐర్లాండ్ బౌలర్లలో జై మూంద్రా, మాథ్యూ హెల్లార్డ్ చెరో 3 వికెట్లు తీసి తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. మార్క్ అడైర్, పాల్ స్టిర్లింగ్ వంటి కీలక ఆటగాళ్లు లేకుండానే ఐర్లాండ్ ఈ అద్భుత విజయం సాధించడం విశేషం. టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ తొలి సిరీస్ లోనే ప్రతికూల ఫలితాన్ని ఎదుర్కొన్నాడు.

# ఇండియా ఇంటికి!



## మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఘోర పరాభవం

**ముగిసిన టీమిండియా కథ.. ఆస్ట్రేలియా చేతిలో ఘోర ఓటమి**

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు ప్రయాణం ముగిసింది. లండన్‌లోని లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియాతో జరిగిన కీలక మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుతమైన అర్ధశతకంతో రాణించినా, ఆస్ట్రేలియా బ్యాటర్లు ఎల్లీస్ పెర్రీ, యాష్లే గార్డ్‌నర్ అసాధారణ భాగస్వామ్యంతో భారత్ ఆశలను గల్లంతు చేశారు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (38), షఫాలీ వర్మ (34) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కేవలం 27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 56 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించింది.

అనంతరం 171 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఆదిలోనే వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. దీంతో భారత్ విజయంపై ఆశలు రేకెత్తాయి. అయితే, క్రీజులో నిలదొక్కుకున్న ఎల్లీస్ పెర్రీ (56), యాష్లే గార్డ్‌నర్ (53 నాటౌట్) భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 100 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను పూర్తిగా ఆస్ట్రేలియా వైపు తిప్పారు. చివరికి ఆస్ట్రేలియా 19 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి, సెమీ ఫైనల్స్‌కు మరింత చేరువైంది. ఈ ఓటమితో భారత జట్టు ప్రపంచకప్‌లో తమ ప్రయాణాన్ని నిరాశగా ముగించింది.



# 52 ఏళ్ల తర్వాత కాంగో తొలి విజయం!

**ఉజ్బెకిస్థాన్‌పై 3-1 తేడాతో ఘన విజయం**

ఫిఫా ప్రపంచకప్‌లో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్ కాంగో) సరికొత్త చరిత్ర సృష్టించింది. 52 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తమ మొట్టమొదటి ప్రపంచకప్ విజయాన్ని నమోదు చేసింది. ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో 3-1 తేడాతో ఘన విజయం సాధించి, టోర్నమెంట్ చరిత్రలో తొలిసారి నాకౌట్ (రౌండ్ ఆఫ్ 32) దశకు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓ దశలో ఒక గోల్ వెనుకబడినప్పటికీ, కాంగో అద్భుతంగా పుంజుకుంది. ఆట 10వ నిమిషంలో ఉజ్బెకిస్థాన్ ఆటగాడు ఎల్డోర్ షోమురోడోవ్ గోల్ చేసి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, ద్వితీయార్ధంలో కాంగో ఎదురుదాడికి దిగింది. 68వ నిమిషంలో లభించిన పెనాల్టీని యోవానే విస్సా గోల్‌గా మార్చి స్కోరును 1-1తో సమం చేశాడు. ఆ తర్వాత కేవలం 10 నిమిషాలకే, 78వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఫిస్టన్ మాయేలే మరో గోల్ చేసి కాంగోకు 2-1 ఆధిక్యాన్ని అందించాడు. ఇంజూరీ టైమ్‌లో విస్సా తన రెండో గోల్ కొట్టి కాంగో విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో కాంగో జట్టు ఉత్తమ మూడో స్థానం పొందిన జట్లలో ఒకటిగా నాకౌట్‌కు అర్హత సంపాదించింది. ఈ ఓటమితో ఉజ్బెకిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. కాంగో దేశం గతంలో 1974లో 'జైర్' పేరుతో ప్రపంచకప్‌కు అర్హత సాధించినా ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత టోర్నీలో అడుగుపెట్టి చారిత్రక విజయం సాధించడం విశేషం. జులై 1న అట్లాంటాలో జరిగే రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో కాంగో పటిష్టమైన ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

# శ్రీవారి సేవలో దిల్షాన్

శ్రీలంక క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ఆల్‌రౌండర్ తిలకరత్నే దిల్షాన్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న టీజీ20 లీగ్‌లో ఆయన 'ఖమ్మం ఏసెస్' జట్టుకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ టోర్నమెంట్ షెడ్యూల్ మధ్య లభించిన విరామ సమయంలో దిల్షాన్ తిరుమలకు విచ్చేశాడు. ఆదివారం ఉదయం విరామ దర్శన సమయంలో దిల్షాన్ స్వామివారి సేవలో పాల్గొన్నాడు. ఆలయ సంప్రదాయాలను గౌరవిస్తూ పంచెకట్టులో కనిపించాడు. దర్శనం పూర్తయిన తర్వాత రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం పలికారు. అనంతరం టీటీడీ అధికారులు దిల్షాన్‌ను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.



# నాకౌట్‌కు పోర్చుగల్




ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ కే హై-వోల్టేజ్ మ్యాచ్‌లో పోర్చుగల్, కోలంబియా జట్లు 0-0 తో డ్రాగా వెనుదిరిగాయి. మయామిలోని హార్డ్ రాక్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్లలోని స్టార్ అటాకర్లు గోల్స్ కోసం తీవ్రంగా శ్రమించినప్పటికీ, ఇరు జట్ల గోల్ కీపర్ల అసాధారణ ప్రతిభ వల్ల మ్యాచ్‌లో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు.

**పోర్చుగల్ గోల్‌కీపర్ డియోగో కోస్టా ఏకంగా ఆరు అద్భుతమైన సేవ్స్‌తో కోలంబియా దూకుడుకు అడ్డుకట్ట వేయగా, మరోవైపు కోలంబియా కీపర్ కామిలో వర్గాస్ కూడా బ్రూనో ఫెర్నాండెజ్ కొట్టిన ప్రమాదకరమైన షాట్‌ను నిలిపివేసి తన జట్టును ఆదుకున్నాడు.**

ఈ మ్యాచ్‌లో ఆట ఆఖరి నిమిషాల్లో ఒక ఆఫ్‌సైడ్ డ్రామా కూడా చోటుచేసుకుంది. ఆట 91వ నిమిషంలో కోలంబియా డిఫెండర్ డానిన్సన్ సాంచెజ్ హెడర్ ద్వారా గోల్ చేసి కోలంబియాను గెలిపించినంత పని చేశాడు, కానీ వీఏఆర్ పరిశీలనలో అది కాస్తా ఆఫ్‌సైడ్‌గా తేలడంతో అంపైర్లు ఆ గోల్‌ను తిరస్కరించారు. పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కోలంబియా డిఫెండర్లు తీవ్రంగా మార్క్ చేయడంతో ఆయన ఈ మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఈ డ్రాతో లభించిన ఒక పాయింట్‌తో కోలంబియా గ్రూప్ ఖ లో మూడు మ్యాచ్‌లలో రెండు విజయాలు, ఒక డ్రాతో మొత్తం 7 పాయింట్లు సాధించి అగ్రస్థానంతో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. అలాగే పోర్చుగల్ జట్టు మూడు మ్యాచ్‌లలో ఒక విజయం, రెండు డ్రాలతో 5 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి రాండ్ ఆఫ్ 32 నాకౌట్ స్టేజ్‌లోకి ప్రవేశించింది. ఇదే గ్రూప్‌లో నాలుగు పాయింట్లతో డీఆర్ కాంగో మూడో స్థానంలో, ఒక్క పాయింట్ కూడా సాధించని ఉజ్బెకిస్తాన్ చివరి స్థానంలో నిలిచి టోర్నీ నుండి నిష్క్రమించాయి. ఈ డ్రా ఫలితం కారణంగా రాండ్ ఆఫ్ 32 నాకౌట్ రౌండ్‌లో పోర్చుగల్ జట్టు బలమైన క్రొయేషియాతో తలపడాల్సి ఉంటుంది.

# మెస్సీ గోల్స్ వేట

ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ తన అద్భుతమైన కెరీర్‌లో మరో చారిత్రక మైలురాయిని అందుకున్నాడు. ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో వరుసగా ఏడు మ్యాచ్‌లలో గోల్ చేసిన తొలి ఆటగాడిగా సరికొత్త రికార్డు సృష్టించాడు. ఆదివారం డల్లాస్ స్టేడియంలో జోర్డాన్‌తో జరిగిన ఫైనల్ గ్రూప్ మ్యాచ్‌లో ఈ అరుదైన ఘనతను సాధించాడు. ఈ మ్యాచ్‌లో మెస్సీకి మొదట తుది జట్టులో చోటు దక్కలేదు. అయితే, ఆట 60వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత ఆట 80వ నిమిషంలో లభించిన ఫ్రీకిక్‌ను అద్భుతంగా గోల్‌గా మలిచాడు. దీంతో



అర్జెంటీనా విజయాన్ని ఖాయం చేయడమే కాకుండా తన రికార్డుల జాబితాను మరింత పెంచుకున్నాడు. ఈ గోల్‌తో ప్రపంచకప్ టోర్నమెంట్లలో మెస్సీ మొత్తం గోల్స్ సంఖ్య 19కి చేరింది. తద్వారా ఆల్-టైమ్ రికార్డును మరింత మెరుగుపరుచుకున్నాడు. అంతేగాక ప్రస్తుత గోల్డెన్ బూట్ రేసులో కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలె, వినిసియస్ జూనియర్, ఎర్లింగ్ హాలాండ్ వంటి స్టార్ ఆటగాళ్ల కంటే రెండు గోల్స్ ఆధిక్యంలో ఉన్నాడు. మెస్సీ గోల్స్ పరంపర 2022 ఖతార్ వరల్డ్ కప్‌లోని రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌తో ప్రారంభమైంది. ఆ తర్వాత నెదర్లాండ్స్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్, క్రొయేషియాతో సెమీఫైనల్‌లో పెనాల్టీల ద్వారా గోల్స్ చేశాడు. ఫ్రాన్స్‌తో జరిగిన ఫైనల్‌లోనూ పెనాల్టీతో పాటు అదనపు సమయంలో మరో గోల్ కొట్టాడు. ప్రస్తుత టోర్నీలో అల్జీరియాపై హ్యాట్రిక్, ఆస్ట్రియాపై డబుల్ గోల్స్‌తో ఈ పరంపరను కొనసాగించాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 29-6-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# మేలుకో సర్కారు.. రైతన్న కోసం!

రైతు చేతిలోని విత్తనం కేవలం ఒక గింజ కాదు. అది ఒక కుటుంబం ఆశ, ఒక ఏడాది జీవనోపాధి, దేశ ఆహార భద్రతకు పునాది. కానీ అదే విత్తనం నకిలీగా మారితే రైతు కలలు మొలకెత్తకముందే నేలకూలిపోతాయి. తెలంగాణలో ప్రతి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడానికి ముందే నకిలీ విత్తనాల వ్యాపారం మళ్లీ తలెత్తడం ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వం, విత్తన సంస్థలు, చట్ట అమలు యంత్రాంగం అప్రమత్తంగా లేకపోతే రైతన్న మరోసారి మోసపోయే ప్రమాదం ఉంది. తెలంగాణ దేశంలోనే ప్రధాన విత్తన ఉత్పత్తి కేంద్రాల్లో ఒకటి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, వరి, కూరగాయల విత్తనాల ఉత్పత్తి, పంపిణీలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాల ముఠాలు కూడా తెలంగాణను కేంద్రంగా చేసుకుని చురుకుగా మారడం ఆందోళన కలిగిస్తోంది. అసలైన కంపెనీల పేర్లతో నకిలీ ప్యాకెట్లు తయారు చేయడం, లేబుళ్లు మార్చడం, నాసిరకం విత్తనాలను అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలు రైతుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఒక రైతు పంట సాగు కోసం భూమిని సిద్ధం చేస్తాడు. విత్తనాలు కొనుగోలు చేస్తాడు. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భరిస్తాడు. వర్షాలు కూడా సహకరిస్తేనే పంట ఆశిస్తాడు. కానీ విత్తనం మొలకెత్తకపోయినా, నాణ్యత లేక దిగుబడి రాకపోయినా అతని మొత్తం పెట్టుబడి వృథా అవుతుంది. మళ్లీ విత్తనం వేయడానికి సమయం ఉండకపోవచ్చు. అప్పులు పెరుగుతాయి. ఆర్థికంగా, మానసికంగా రైతు కుంగిపోతాడు. ఇది ఒక్క రైతు సమస్య కాదు. ఒక ప్రాంతంలో పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలు చెలామణి అయితే మొత్తం పంట ఉత్పత్తి తగ్గుతుంది. దాని ప్రభావం మార్కెట్ ధరలపై, ఆహార భద్రతపై, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా పడుతుంది. ప్రతి ఏడాది సీజన్‌కు ముందు అధికారులు తనిఖీలు నిర్వహించడం, నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకోవడం జరుగుతూనే ఉంది. కానీ సమస్య పూర్తిగా తగ్గడం లేదు. కారణం నకిలీ విత్తనాల వ్యాపారం వెనుక ఉన్న సంఘటిత నెట్‌వర్క్. ఒక ప్రాంతంలో దాడులు జరిగితే మరో ప్రాంతంలో కొత్త పేర్లతో వ్యాపారం కొనసాగుతోంది. అందుకే కేవలం దాడులు చేయడం సరిపోదు. విత్తనం ఉత్పత్తి నుంచి రైతు చేతికి చేరే వరకు మొత్తం సరఫరా వ్యవస్థను డిజిటల్‌గా పర్యవేక్షించాలి. ప్రతి విత్తన ప్యాకెట్‌కు క్యూఆర్ కోడ్, ట్రాకింగ్ వ్యవస్థ, లైసెన్స్ కలిగిన డీలర్ల జాబితా, ఆన్‌లైన్ ధృవీకరణ వంటి ఆధునిక పద్ధతులను తప్పనిసరి చేయాలి. చాలా సందర్భాల్లో తక్కువ ధరకు వస్తోందనే ఆశతో లేదా పరిచయస్తుల మాట నమ్మి రైతులు అనధికార విక్రేతల వద్ద విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. విత్తనం కొనుగోలు చేసే ముందు బిల్ తీసుకోవడం, అధికారిక డీలర్ల వద్ద నుంచే కొనుగోలు చేయడం, ప్యాకెట్‌పై ఉన్న వివరాలను పరిశీలించడం వంటి అంశాలపై విస్తృత ప్రచారం అవసరం. వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి. నకిలీ విత్తనాలు విక్రయించడం సాధారణ ఆర్థిక నేరం కాదు. ఇది రైతు జీవితాన్ని నాశనం చేసే నేరం. అలాంటి వారికి కఠిన శిక్షలు విధించాలి. వేగవంతమైన దర్యాప్తు, ప్రత్యేక న్యాయ ప్రక్రియ, ఆస్తుల స్వాధీనం వంటి చర్యలు తీసుకుంటేనే అక్రమ వ్యాపారులకు భయం కలుగుతుంది. అదే సమయంలో నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందించే విధానం కూడా ఉండాలి. దేశం ఆహార ఉత్పత్తిలో ముందంజలో ఉండాలంటే మొదట విత్తనం నాణ్యంగా ఉండాలి. రైతు నమ్మకాన్ని కాపాడడం అంటే వ్యవసాయాన్ని కాపాడినట్టే. విత్తన నాణ్యతపై రాజీ పడితే పంటల దిగుబడులు మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. తెలంగాణ రైతు నేటి పరిస్థితుల్లో వాతావరణ మార్పులు, పెరుగుతున్న సాగు ఖర్చులు, నీటి సమస్యలు, మార్కెట్ అనిశ్చితి వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాడు. వీటికి తోడు నకిలీ విత్తనాల మోసం మరో భారంగా మారకూడదు. రైతు భూమిలో పడే ప్రతి విత్తనం నాణ్యమైనదేననే నమ్మకాన్ని కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపడం అంటే కేవలం ఒక అక్రమ వ్యాపారాన్ని అరికట్టడం కాదు; తెలంగాణ రైతు భవిష్యత్తును, రాష్ట్ర వ్యవసాయాన్ని, ఆహార భద్రతను కాపాడడం. రైతు చేతిలోని విత్తనం నమ్మకానికి ప్రతీకగా ఉండాలి గానీ, మోసానికి కాదు. అదే నిజమైన రైతు సంక్షేమం.

ఒక్కసారి ట్రైచేయ్..
టెన్షన్ తగ్గుతుంది..
స్టైల్‌గా ఉంటుంది..
తలకాయ ఝుమ్ అంటది..
ఇలా ప్రారంభమయ్యే అలవాటు అది..
జీవితాంతం వెంటడే వ్యసనం అది..
ఒక విద్యార్థి చదువును నాశనం చేస్తది..
ఒక ఉద్యోగి ఉద్యోగాన్ని లాగేస్తది..
ఒక కుటుంబాన్ని కుంగదీస్తది..
ఎన్నో ప్రాణాలను చిదిమేస్తది..
అదే.. 'డ్రగ్స్' అనే మహమ్మారి!!



# నిషా.. నిద్దుర లేవోయ్ పిలగా!

ఒకప్పుడు మాదకద్రవ్యాల సమస్య కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమై ఉండేది. కానీ నేడు అది ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశానికీ సవాలుగా మారింది. సరిహద్దులు దాటి పనిచేస్తున్న అంతర్జాతీయ అక్రమ రవాణా ముఠాలు యువతనే ప్రధాన లక్ష్యంగా చేసుకుని విద్యాసంస్థలు, పట్టణాలు, సామాజిక మాధ్యమాల ద్వారా వ్యసన సంస్కృతిని విస్తరించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ పరిస్థితి కేవలం చట్టవ్యవస్థకే కాదు, కుటుంబ వ్యవస్థకు, సమాజానికి, దేశ భవిష్యత్తుకూ తీవ్రమైన హెచ్చరిక. యువత మాదకద్రవ్యాల బారిన పడటానికి అనేక కారణాలు ఉన్నాయి. చెడు స్నేహాలు, తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం, చదువు–ఉద్యోగాల ఒత్తిడి, మానసిక ఆందోళనలు, ఒంటరితనం, సోషల్ మీడియా ప్రభావం, పార్టీల సంస్కృతి, కేవలం ఆసక్తితో ఒకసారి ప్రయత్నించడం వంటి అంశాలు కలిసి వారిని వ్యసనం వైపు నెడుతున్నాయి. "ఒక్కసారి ప్రయత్నిస్తే ఏమవుతుంది?" అనే నిర్లక్ష్య ధోరణి చివరకు జీవితాన్నే సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉంది. మాదకద్రవ్యాలు మెదడు, గుండె, కాలేయం, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. జ్ఞాపకశక్తి తగ్గడం, మానసిక అస్థిరత, డిప్రెషన్, కోపం, హింసాత్మక ప్రవర్తన వంటి సమస్యలు తలెత్తుతాయి. వ్యక్తిగత ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, విద్యా వైఫల్యాలు, నేరప్రవృత్తి, రోడ్డు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయి. అందువల్ల ఇది వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు; సామాజిక సంక్షోభంగా మారుతోంది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది రూపాయల నల్లధనాన్ని సృష్టిస్తోంది. ఈ అక్రమ సంపాదన ఇతర అంతర్జాతీయ నేరాలకు, ఉగ్రవాదానికి, ఆయుధాల అక్రమ రవాణాకు కూడా వినియోగించే అవకాశం ఉందని భద్రతా సంస్థలు హెచ్చరిస్తున్నాయి. అందుకే ప్రపంచ దేశాలు ఈ సమస్యను కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా జాతీయ భద్రతా అంశంగానూ పరిగణిస్తున్నాయి. మాదకద్రవ్యాలను అరికట్టడం అంటే కేవలం ఒక నేరాన్ని ఆపడం కాదు; ఒక తరం భవిష్యత్తును కాపాడడం.



మాదకద్రవ్యాలు అంటే మనిషి మెదడు, నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి ఆలోచన, నిర్ణయ సామర్థ్యం, ప్రవర్తనను మార్చే రసాయన పదార్థాలు. వైద్యుల సూచనతో ఉపయోగించే ఔషధాలు ఒకవైపు ఉంటే, మత్తు కోసం అక్రమంగా వినియోగించే పదార్థాలు మరోవైపు ఉంటాయి. ఒకసారి వ్యసనం ఏర్పడితే వ్యక్తి ఆరోగ్యం, కుటుంబం, విద్య, ఉద్యోగం, చివరికి జీవితం కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వైద్య నిపుణులు "మొదటి మోతాదే చివరి మోతాదుగా ఉండాలి" అని హెచ్చరిస్తున్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం "మాదకద్రవ్యాలు వద్దు -- జీవితాలు ముద్దు", "మిషన్ పరివర్తన", "నశా ముక్త్ భారత్ అభియాన్" వంటి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోంది. జిల్లా కలెక్టర్లు, పోలీసు శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, మహిళా–శిశు సంక్షేమ శాఖలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో ప్రతిజ్ఞలు, ర్యాలీలు, పోస్టర్ ప్రదర్శనలు, వ్యాసరచన పోటీలు, వీధి నాటకాల ద్వారా విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలను వివరిస్తున్నారు.
మాదకద్రవ్యాల నియంత్రణకు భారతదేశంలో అమల్లో ఉన్న ఎన్డీపీఎస్ చట్టం–1985 కఠిన నిబంధనలను కలిగి ఉంది. అక్రమ ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయం, పంపిణీ, వినియోగం వంటి నేరాలకు చట్టం ప్రకారం కఠిన శిక్షలు, జరిమానాలు విధించే అవకాశం ఉంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్ర పోలీసు శాఖ, కస్టమ్స్ తదితర దర్యాప్తు సంస్థలు సమన్వయంతో అక్రమ ముఠాలపై చర్యలు తీసుకుంటున్నాయి. అయినప్పటికీ చట్టం ఒక్కటే సరిపోదు; సమాజం కూడా బాధ్యత వహించాల్సిందే. ఈ పోరాటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడటం, వారి స్నేహితులు, అలవాట్లు, ప్రవర్తనలో మార్పులను గమనించడం అవసరం. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల్లో కనిపించే అసాధారణ మార్పులను గుర్తించి తల్లిదండ్రులకు తెలియజేస్తే అనేక కుటుంబాలు ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

అదే సమయంలో వ్యసనానికి గురైన వారిని కేవలం నేరస్తులుగా చూడడం సరైన దృక్పథం కాదు. మానసిక ఒత్తిడి, నిరాశ, చెడు స్నేహాలు వంటి కారణాలతో చాలామంది ఈ వ్యసనంలో చిక్కుకుంటారు. కుటుంబ సభ్యుల అండ, వైద్యుల చికిత్స, మానసిక నిపుణుల కౌన్సెలింగ్, వ్యసన విముక్తి కేంద్రాల సహకారంతో వారు తిరిగి సాధారణ జీవితంలోకి రావచ్చు. వ్యసనాన్ని దాచడం కాదు; చికిత్స చేయించడం అవసరం. ప్రతి పౌరుడికీ ఈ సమస్యపై బాధ్యత ఉంది. పరిసరాల్లో మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం లేదా అక్రమ రవాణా కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించడం సామాజిక బాధ్యతగా భావించాలి. అదే సమయంలో యువతలో క్రీడలు, యోగ, ధ్యానం, సంగీతం, పుస్తక పఠనం, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తిని పెంపొందించడం ద్వారా వ్యసనాలకు ప్రత్యామ్నాయమైన ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించాలి. మన భారతీయ సంస్కృతి క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం, సత్సంగం, సద్గుణాల ప్రాధాన్యాన్ని బోధిస్తుంది. భగవద్గీతలోని "ఉద్ధరేదాత్మనాత్మానం..." అనే సందేశం కూడా మనిషి తన మనస్సును నియంత్రించుకొని తన జీవితాన్ని తానే ఉన్నత స్థితికి తీసుకెళ్లాలని సూచిస్తుంది. ఈ విలువలు నేటి యువతకు మరింత అవసరం. మాదకద్రవ్యాలు ఒక వ్యక్తిని మాత్రమే కాదు; ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని, ఒక రాష్ట్రాన్ని, చివరికి దేశ భవిష్యత్తునే దెబ్బతీస్తాయి. అందుకే ఈ సమస్యను పోలీసుల బాధ్యతగా మాత్రమే కాకుండా సమాజమంతా కలిసి ఎదుర్కోవాల్సిన సవాలుగా చూడాలి. యువత చేతిలో మాదకద్రవ్యాలు కాకుండా పుస్తకాలు, లక్ష్యాలు, కలలు ఉండే సమాజాన్ని నిర్మించగలిగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.


శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9133947176

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.